క్లుప్తంగా

వైభవంగా వాలీశ్వరస్వామి రథోత్సవం

రామసముద్రం : మండలంలోని బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి మండలంలోని భక్తులతో పాటుగా కర్నాటక నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే కొండపై ఎలవానెల్లూరు సర్పంచ్ ఉదయ్‌శంకర్ రెడ్డి, ఎంపీటీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మూగవాడి గ్రామంలో శ్రీ పుండీశ్వరస్వామి ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉట్లోత్సవంను తిలకించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎఫ్‌బీఓ మృతికి సంతాపం

కలికిరి(వాల్మీకిపురం) : గుర్రంకొండ మండలం తరిగొండ ఫారెస్ట్ బీట్ అధికారి శేఖర్(60) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శేఖర్ మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువపై వంతెన నిర్మించాలని నిరసన

ములకలచెరువు : హంద్రీనీవా కాలువపై వంతెన నిర్మించాలని కురవపల్లె పంచాయతీ ఎండపల్లెకు చెందిన వారు శుక్రవారం కాలువ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివరాలు... కురవపల్లె, కొండ్లపల్లె, ఎండపల్లె నుంచి హంద్రీనీవా కాలువ వెళ్తుంది. ఈ కాలువతో రాకపోకలు, స్మశానంకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని కాలువ పనులు చేపట్టాలని వారు కోరారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ నిరసనలో రామిరెడ్డి, వెంకటరమణ, నారాయణ తదితరులు ఉన్నారు.

ఏఓకు సన్మానం

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ)గా పని చేసిన కేఎస్ నిత్యానంద్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇటీవలనే ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఇక్కడ పని చేసిన ఇద్దరు ఏఓలు రిటైర్డ్ కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో పాటు ఐకేపీ, హౌసింగ్, ఉపాధి హామీ సిబ్బంది, పలువురు నాయకులు ఏఓను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.

వీఆర్‌ఏలపై చిన్నచూపు తగదు

పీలేరు : వీఆర్‌ఏలపై పీలేరు తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు చిన్నచూపు తగదని వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రత్నశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు గ్రామాల్లో ప్రజలతో, ఇటు కార్యాలయంలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ అందిరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న వీఆర్‌ఏలపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడండి

- డీఎస్పీకి ముస్లిం, మైనారిటీల వినతి
- అభద్రతాభావం అవసరం లేదన్న ఎమ్మెల్యే



జామియా మసీదు పరిరక్షణ కమిటీ నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : పట్టణంలోని వక్ఫ్ ఆస్తులను కాపాడాలని జామియా మసీదు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ నాయబ్ సికిందర్ అలీఖాన్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు భారీసంఖ్యలో బెంగళూరు బస్టాండ్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీఎస్పీ కొండయ్యనాయుడును కలిసి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కదిరిరోడ్డులో మసీదుల నిర్వహణ కోసం హజరత్.టిప్పుసుల్తాన్ ఇచ్చిన మసీదు మాన్యాలను కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని కఠినంగా శిక్షించి అరెస్ట్ చేయాలని కోరారు. వక్ఫ్ ఆస్తులపై జామియా మసీదుకు తప్ప ఇతరులకు ఎలాంటి సంబంధం లేదని 2004లో మదనపల్లె సీనియర్ సివిల్ జడ్జి 33/94లో తీర్పు ఇచ్చారన్నారు. అయితే ఇటీవల కొందరు వక్ఫ్ ఆస్తుల్లో అక్రమంగా ప్రవేశించి మసీదుపై, ముస్లిం జమాత్‌పై రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడటం చేశారన్నారు. వారిపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదుచేశారన్నారు. జామియా మసీదు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మూడురోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మసీదు భూముల్లో అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం సమాజం వక్ఫ్‌భూముల విషయంలో అభద్రతాభావం అవసరం లేదని, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. మదనపల్లె వక్ఫ్‌భూముల్లో ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి హక్కులు లేవని, వీటిని కాపాడేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జామియా మసీదు పరిరక్షణ కమిటీ సభ్యులు, మసీదు పెద్దలు హాజీ గౌస్ మొహియుద్దీన్, అబూబకర్, అక్బర్‌బాషా, సాజీద్‌అలీఖాన్, సర్దార్‌ఖాన్, గౌస్, సికిందర్‌బాషా, పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



బందెల గౌతమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బాస్, వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు

మదనపల్లె : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బందెల గౌతమ్ కుమార్‌ను భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో పలు పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బాస్ వ్యవస్థాపకులు పీటీయం.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో భారతీయ అంబేడ్కర్ సేనతోపాటు వీసీకే, సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు, బి.ఎస్.ఐ, బుద్ధ అంబేడ్కర్ సమాజ్, ఆర్పీఎస్, క్రిస్టియన్ యూత్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని, శాలువలతో సత్కరించారు. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ బహుజన ఉద్యమాలలో గౌతమ్ కుమార్ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని, అందుకే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష పదవి అతన్ని వరించిందన్నారు. మదనపల్లె నుంచి జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి గౌతమ్ కుమార్ అని ప్రశంసించారు. శ్రమ నీ ఆయుధమైతే – విజయం నీ బానిస అవుతుందన్నట్లుగా.... ఎవరైతే తమ లక్ష్యం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తారో వారు ఖచ్చితంగా విజయం సాధిస్తారని చెప్పారు. అనంతరం గౌతమ్ కుమార్ మాట్లాడుతూ బహుజన సమూహాల ఐక్యత కోసం కృషి చేస్తానని, బహుజన రాజ్యాధికార సాధనకు తన జీవితాన్ని అంకితం చేస్తానన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలను, సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ పోతబోలు రెడ్డెప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, సీపీఐ నాయకులు తోపు కృష్ణప్ప, మురళి, వీసీకే పార్టీ స్టేట్ మీడియా సెక్రటరీ టి.ఎ. పీర్ బాషా, బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, బుద్ధ అంబేడ్కర్ సమాజ్ సభ్యుడు చాట్ల బయన్న, బి.ఎస్.ఐ జిల్లా నాయకుడు ముత్యాల మోహన్, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు కోనేటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణల తొలగింపులో వివక్ష చూపకండి

కలెక్టర్‌కు బహుజనసేన వినతి



ఆక్రమణల విషయమై జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో మాట్లాడుతున్న బహుజనసేన నాయకులు

మదనపల్లె : పట్టణం, మండలంలోని బైపాస్‌రోడ్డు, సీటీఎం గ్రామపంచాయతీ, అమ్మచెరువుమిట్ట, సామిచెరువు, కోమటివానిచెరువు తదితర ప్రాంతాల్లో అడ్డూఅదుపు లేకుండా జరిగిన భూఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారులు వివక్ష చూపకుండా విధులు నిర్వర్తించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు వినతిచేశారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరైన కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ..సామిచెరువు సర్వేనెం.453లో 56 సెంట్ల భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదుచేస్తే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటుచేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో బో ర్డును తొలగించి, పెద్ద షెడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. అలాగే సీటీఎం చెరువు 600 ఎకరాలు ఉంటే, అందులో 3.5 ఎకరాల భూమిని కన్వర్షన్ చేస్తే యథేచ్ఛగా 10 ఎకరాలకు పైగా దౌర్జన్యంగా ఆక్రమించి లేఔట్ వేశారని, వీటిపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కోమటివానిచెరువు 43 ఎకరాల విస్తీర్ణం ఉంటే, అందులో సగానికి పైగా ఆక్రమణలకు గురైందన్నారు. దళితులు, పేదలు సెంటుస్థలంలో నిర్మాణాలు చేస్తే నిబంధనలు గుర్తుకు వచ్చే అధికారులకు పెద్దస్థాయిలోని వ్యక్తులు చేసే ఆక్రమణలు గుర్తుకురావా అని ఆవేదన వ్యక్తం చేశారు. యనుములవారిపల్లె చెరువులో వందల లోడ్ల మట్టిని టిప్పర్‌లతో ప్రైవేట్ లేఅవుట్‌కు తోలుతుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్టీ వీఆర్వో మునస్వామినాయక్‌పై దాడికి పాల్పడితే అధికారులు ఏ చర్యలు తీసుకున్నారో తెలిపి, విధి నిర్వహణలో ఎలాంటి వివక్షలేకుండా పారదర్శకంగా బాధ్యతలు నిర్వహించాలని కోరారు.

శివరాత్రికి రూ.26 లక్షల ఆదాయం

మదనపల్లె సిటీ : మహాశివరాత్రి పురస్కరించుకుని మదనపల్లె వన్ డిపో నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ, అంగళ్లు వద్దనున్న మల్లయ్యకొండలకు ప్రత్యేక బసు సర్వీసులు నడపడం ద్వారా రూ.26 లక్షలు ఆదాయం వచ్చినట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండ కిందకు,పైకి రూ.17,57,880, మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు రూ.6,76,581 ఆదాయం వచ్చిందన్నారు. అంగళ్ల వద్దనున్న చిన్న మల్లయ్యకొండకు రూ.1,70,505 ఆదాయం వచ్చిందన్నారు. ఇందుకు సహకరించిన ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు.

పీలేరు రూరల్ : మహాశివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులతో ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు డీఎం పి.నిర్మల తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 26, 27వ తేదీలలో తలకోన, కలకడ ఝరి ఉత్సవానికి 35 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపి రూ. 13,60,959 ఆదాయం సాధించినట్లు చెప్పారు.

22 ఏళ్ల తర్వాత సిద్దేశ్వర స్వామి రథం ఊరేగింపు



కలకడ : కలకడ శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామికి కలకడ పురవీధులలో ఊరేగించే రథం 22 సంవత్సరాల తర్వాత ఆలయ ప్రదక్షిణ చేసి ఊరేగింపు చేశారు. 1992లో కొందరు అల్లరిమూకలు కలకడలోని వేణుగోపాలస్వామి ఆలయం ముందు ఉంచిన రథానికి నిప్పు అంటించారు. దీంతో ముస్లిం సోదరులు అంటించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. హిందూ–ముస్లిం సోదరులు ఐక్యతతో ఎలాంటి ఘర్షణలు లేకుండా రథోత్సవం నిర్వహించాలని అప్పట్లో నిర్ణయించారు. అనంతరం రథం అభివృద్ధికి అందరూ కూడలేదు. ఈ ఏడాది ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవం నిర్వహించాలని భావించారు. శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం హరినామ స్మరణతో రంథం లాగడానికి భక్తులు పోటీపడ్డారు.

టమాటా మార్కెట్‌లో జాక్‌పాట్ వేలం రద్దు

- మార్కెట్ మండీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక
- నూతన అధ్యక్షుడిగా ఎన్.సురేంద్ర

మదనపల్లె : టమాటా క్రయవిక్రయాలకు దేశంలోనే పేరుమోసిన మదనపల్లె మార్కెట్‌లో జాక్‌పాట్ విధానంలో నిర్వహిస్తున్న వేలం పాటలను రద్దుచేస్తున్నామని, ఇకపై నిర్వహిస్తే ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్ హెచ్చరించారు. శుక్రవారం మదనపల్లె టమాటా మార్కెట్ మండీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జి.జయరామిరెడ్డి, సీ.ఎం.అబూబకర్, షేక్‌ప్యారేజాన్, అధ్యక్షుడిగా ఎన్.సురేంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా నిసార్‌అహ్మద్, సెక్రటరీగా ఉమ్మర్‌షరీఫ్, జాయింట్ సెక్రటరీగా సికిందర్, ట్రెజరర్‌గా కృష్ణమూర్తి గుప్త, డైరెక్టర్లుగా పృథ్వీరాజ్, డీఏజీ.రఫీ, అరుణ్‌కుమార్, జయవేలు, అసరుద్దీన్, శంకర, శివారెడ్డి, ఏఎస్ఆర్.స్వామి, అనిల్ ఎన్నికయ్యారు. నూతన అసోసియేషన్ సభ్యులు, సెక్రటరీ అభిలాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ అభివృద్ధికి సంబంధించి పలువిషయాలు చర్చించారు. మదనపల్లె టమాటా మార్కెట్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు అధికారులు, మండీ యజమానుల అసోసియేషన్ కలిసికట్టుగా పనిచేద్దామన్నారు.

దళిత గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : దళిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ దళితవాడలో మానవహక్కుల దినం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి దళిత గ్రామ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటి సమస్యలు అప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య, వాటర్ ట్యాంకు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో 40 దళిత కుటుంబాలు ఉన్నాయని, వర్షం పడితే అన్ని ఇండ్లు తడిసిపోతున్నాయని, తక్షణమే తమకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే స్మశాన స్థలం కేటాయించాలని, గుడికి, కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందు ప్రభుత్వ అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివవంకర్, ఎస్ఐ బాలకృష్ణ, హౌసింగ్ డీఈ రమణ, మానటరింగ్ కమిటీ సభ్యులు బోదేషావలి, వివిధ సంఘాల నాయకులు గట్టప్ప, దరణికుమార్, వెంకటేష్, సుభాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



సీవీ రామన్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు మదనపల్లెలో శుక్రవారం కాలేజీలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పుంగనూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో హ్యుమానిటీస్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలని, విజ్ఞానాన్ని క్షుణంగా అధ్యయనం చేయాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని సీవి రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు వివిధ సైన్సు నమూనాలను ప్రదర్శించారు. అలాగే స్థానిక ప్రభుత్వ బీటీ డిగ్రీ కాలేజీలో జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. కాలేజీ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. అనంతరం కాలేజీలో సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పీలేరు : విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హెచ్ఎంలు నటరాజన్, సురేంద్రనాథరెడ్డి, ఫౌజియాబేగం అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలను హెచ్ఎంలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. పరిశోధనల వైపు విద్యార్థి దశ నుంచే మొగ్గు చూపాలని తెలిపారు. ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని సైన్స్‌లో రాణించాలని సూచించారు.

మహా కుంభాభిషేక మహోత్సవం ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత ఉత్సవ విగ్రహం

మదనపల్లె సిటీ : స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం మహా కుంభాభిషేక మహోత్సవం ఘనంగా ప్రారంభించారు. ఉదయం ఆలయంలో గురుప్రార్థన, మూల దేవతల ప్రార్థన, గోపూజ, గంగపూజ, మహాగణపతి పూజ, స్వస్తివాచనం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్థానిక ఆర్యవైశ్యహాస్టల్ నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్ తెలిపారు. ర్యాలీకి ఆర్యవైశ్యులు పాల్గొనాలని కోరారు. మార్చి 2 వతేదీన మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్యసభ్యులు టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ దూండీ,ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి గిరిధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు
- అమ్మవారి పూజల్లో వేలాది భక్తులు
- జాతర ప్రాంగణానికి చేరిన గంగమ్మ



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : భక్తుల ఇలవేల్పు అనంతపురం గంగమ్మ జాతరకు ప్రారంభమైంది. వేలాది భక్తుల సందర్శనార్థం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. మహిళలకు తాత్కాలిక స్నానపు గదులు, తాగునీరు, విద్యుత్తు సమస్య తలెత్తకుండా ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మదన్ మోహన్, పూజారులు చెల్లుగంగరాజు, ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విద్యుద్దీపాలంకరణలో ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది. అన్నమయ్య జిల్లా ఆర్డీఓ శ్రీనివాసులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు. రాయచోటి డీఎస్పీ క్రిష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకటకొండారెడ్డి,, ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బంది ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. గంగమ్మ దేవత అమ్మవారి అలంకరణకు పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన కానాల గంగిరెడ్డి రూ.3 లక్షలు ఖర్చు చేయనున్నారు.

ఆలయానికి చేరిన గంగమ్మతల్లి

మండలంలోని అనంతపురం గ్రామం గొల్లపల్లెలోని గంగమ్మ తల్లికి చెల్లు వంశీయులైన చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, పూజారులు సురేంద్ర కుటుంబసభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఏటా దాగిరి(బుట్ట)లో అమ్మవారిని వుంచి మూసి వేస్తారు. శుక్రవారం పార్వేట అమావాస్య రోజున దాగిరిలో ఉన్న అమ్మవారిని శుద్ధజలంతో అభిషేకించి గ్రామంలో ఊరేగించారు. డప్పు వాయిద్యాల మధ్య, బాణసంచా పేలుస్తూ గంగమ్మ ఆలయంలోకి తీసుకెళ్లారు. గంగమ్మ తల్లి ఆలయంలోకి ప్రవేశించగానే జాతర ప్రారంభానికి సూచన ప్రాయంగా భక్తులు చెబుతారు.

చాగలగుట్టపల్లెనుంచి..

మండలంలోని చాగలగుట్టపల్లెలో గంగమ్మ తల్లికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య రోజున అమ్మవారిని పూజలు చేసి బయట ఉంచారు. జాగారంలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరుసటి రోజు తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళ వాయిద్యాల నడుమ అప్పలరాజుగారిపల్లె, మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు, చౌటపల్లెల మీదుగా పోలీసుల బందోబస్తు నడుమ ఊరేగింపుగా అనంతపురం గంగమ్మ ఆలయంలోకి తీసుకెళ్తారు. ఊరేగింపులో దారి పొడవునా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. సీఐ కొండారెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు.


బడ్జెట్ కేటాయింపుల్లో కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న రామాంజులు, తదితరులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో కార్మికులకు అన్యాయం జరుగుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కమిటీ కార్యదర్శి ఎ.రామాంజులు, కోశాధికారి హరిశర్మ తెలిపారు. విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ వేతనాల కోసం పని చేస్తున్న కార్మికులకు బడ్జెట్ కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వక పోవడం దారుణమన్నారు. గ్రాట్యూటీ అమలుపై ఎలాంటి జీవో ఇవ్వకుండానే, హామీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వీఓఏ, గ్రామ పంచాయతీ వర్కర్లు, స్కీం వర్కర్ల వేతనాల పెంపు ప్రస్తావనే లేదన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం అన్యాయమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులు, ఉద్యోగుల జీతాల పెంపునకు మార్పులు చేయాలంటూ కోరారు.

లైంగిక దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ శివ ప్రతాప్

మదనపల్లె : చిన్నారులపై లైంగిక దాడులు అరికట్టేందుకు ఐసీడీఎస్, విద్య, వైద్య శాఖ క్షేత్ర స్థాయి అధికారులు కృషిచేయాలని ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని డైట్ సమావేశ భవనంలో లైంగిక దాడుల నివారణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. శివప్రసాద్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వసతిగృహాల్లో బాలికలను చైతన్యపరచాలని సూచించారు. డైక్ వైద్యులు సురేష్ రెడ్డి నవీన్ సైకాలజిస్ట్ ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన భూకబ్జాదారుడు అరెస్ట్

మరో ఇద్దరిపై కేసు నమోదు



భూకబ్జాదారుడు చలపతిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : కొండామారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ ఉద్యోగులపై దాడికి పాల్పడిన భూకబ్జాదారుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూకబ్జాదారుడు చలపతి అరెస్ట్‌కు సంబంధించి వివరాలు వెల్లడించారు. దేవతానగర్ సర్వే నెంబర్.1029లోని ప్రభుత్వ గయాలు స్థలంలో ఈనెల 25వ తేదీన కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి రాత్రి సమయంలో పునాది వేసి ఇనుపరేకులతో షెడ్ నిర్మిస్తున్నట్లుగా రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో 26వతేదీ ఉదయం ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వో ప్రసాద్ ప్రభుత్వ భూమి వద్దకు వెళ్లి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించుకుని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ధనంజయులుకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు జేసీబీతో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా, శివాజీనగర్‌కు చెందిన భూకబ్జాదారుడు అంబిటి చలపతి(47), చంద్రాకాలనీకి చెందిన ప్రదీప్, అతడి తండ్రి రమణయ్యలు మారణాయుధాలతో రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డారు. వారి విధులను అడ్డుకోవడమే కాకుండా, ఆక్రమణ తొలగించేందుకు జేసీబీపై పెట్రోల్ చల్లి నిప్పటించారు. ఘటనపై తాలూకా సీఐ కళా వెంటరమణకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కేసులోని మొదటి నిందితుడైన అంబటి చలపతిని పోలీసు సిబ్బందితో కలిసి అరెస్టు చేశామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యయత్నానికి పాల్పడి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లి మండలం ముష్టూరు పంచాయతీ పారాసువారిపల్లెకు చెందిన మణికంఠ(29) కుటుంబ సమస్యలతో భార్యతో గొడవ పడ్డాడు. మనస్తాపం చెందిన అతడు ఇంటి వద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని తిరుపతికి తరలించారు. అదేవిధంగా చౌడేపల్లి మండలం మద్దిరెడ్డిగారిపల్లికి చెందిన చిన్నప్ప భార్య ఎర్రమ్మ (28) కుటుంబ సమస్యలతో గురువారం రాత్రి ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియకపోవడంతో శుక్రవారం ఉదయం గమనించి బాధితురాలిని మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

– ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు

పెద్దమండ్యం : నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా నవోదయం 2.0ను అమలు చేస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు పేర్కొన్నారు. మండలంలోని బండకిందతండాలో సర్పంచ్ శిరీష అధ్యక్షతన నవోదయం 2.0పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా నిర్మూలనపై అధికారులతో కలిసి తండా వాసులు ప్రతిజ్ఞ చేయించారు. ఏఈఎస్ జోగేంద్ర, తహసీల్దారు సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్ఐ గాజులరమేష్, సీఐలు లక్ష్మన్న, మాధవి, ఎస్ఐలు పీవీ.రమణ, బాబు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

రాజంపేట రూరల్ : పట్టణంలో శుక్రవారం వేకువజామున దొంగలు హల్ చల్ చేశారు. నూనివారిపల్లిలోని అక్షర స్కూల్ వీధిలోని ఐదిళ్లలో దోపిడీకి ప్రయత్నించారు. నాలుగు గృహాల యజమానులు దొంగల రాకను పసిగట్టడంతో వారు పరారయ్యారు. అయితే ఎల్ఐసీ (మేడా) సుబ్బారెడ్డి దంపతులు కుంభమేళాకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఇంటిలో బంగారం, నగదు దోచుకెళ్లినట్లు వారి కుమారుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.